శ్రేయాస్, ఇషాన్‌కు మళ్లీ కాంట్రాక్టు

టాప్ గ్రేడ్‌లో 'రోకో'

గ్రేడ్-ఏలోనే సిరాజ్ కొత్తగా నితీశ్ సహ ఐదుగురికి చోటు

బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టులు ఖరారు

న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) వార్షిక కాంట్రాక్టులను ఖరారు చేసింది. మొత్తం 34 మంది క్రికెటర్లతో సోమవారం జాబితాను విడుదల చేసింది. అక్టోబర్ 1, 2024 నుంచి సెప్టెంబర్ 30, 2025 వరకు గాను బోర్డు క్రికెటర్లను ఎంపిక చేసింది. టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్లు 'రోకో' జోడీగా పిలుచుకునే రోహిత్‌శర్మ, విరాట్‌కోహ్లీ టాప్‌గ్రేడ్ అయిన 'ఏ+'లో చోటు నిలుపుకున్నారు. ఇప్పటికే అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికిన రోహిత్, కోహ్లీ..వన్డే, టెస్టుల్లో కొనసాగుతున్నారు. ఈ జాబితాలో వీరిద్దరితో పాటు బుమ్రా, జడేజా అత్యధికంగా 7 కోట్ల వేతనం అందుకోనున్నారు. దేశవాళీ క్రికెట్ ఆడలేదన్న కారణంతో బోర్డు ఆగ్రహానికి గురైన శ్రేయాస్ అయ్యర్, ఇషాన్‌కిషన్ తిరిగి కాంట్రాక్టులు దక్కించుకున్నారు. హైదరాబాదీ స్పీడ్‌స్టర్ మహమ్మద్ సిరాజ్ గ్రేడ్-ఏలో చోటు నిలబెట్టుకున్నాడు. తన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొడుతున్న ఏపీ క్రికెటర్ నితీశ్ కుమార్‌రెడ్డి, హర్షిత్ రానా సహ ఐదుగురికి కొత్తగా కాంట్రాక్టు దక్కింది. వార్షిక కాంట్రాక్టుల్లో ఏ+ గ్రేడ్ క్రికెటర్లకు ఏడాదికి రూ. 7 కోట్లు, ఏ విభాగానికి రూ. 5 కోట్లు, బీ, సీ కేటగిరీల్లో వరుసగా రూ. 3 కోట్లు, కోటి రూపాయలు దక్కనున్నాయి. ఐపీఎల్‌లో తమ తమ ఫ్రాంచైజీల తరఫున అర్ధసెంచరీలతో రాణించిన మరుసటి రోజే విరాట్, రోహిత్ టాప్ గ్రేడ్‌లో చోటు నిలుపుకున్నారు. అయితే రానున్న ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ ఆధారంగా రోహిత్‌శర్మ కెప్టెన్సీపై స్పష్టత రానుంది. రోహిత్ కెప్టెన్‌గా కొనసాగుతాడా లేదా అన్నది చీఫ్ కోచ్ గౌతం గంభీర్ నిర్ణయంపై ఆధారపడనుంది. ఇదిలా ఉంటే సీనియర్ ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్‌తో పాటు అవేశ్‌ఖాన్, కేఎస్ భరత్, జితేశ్‌శర్మను బీసీసీఐ కాంట్రాక్టు జాబితా నుంచి తప్పించింది.

నిత్యకు స్వర్ణం

కొచ్చి: 28వ జాతీయ ఫెడరేషన్ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ అథ్లెట్ నిత్య గాదె పసిడి పతకంతో మెరిసింది. సోమవారం జరిగిన మహిళల 100మీటర్ల రేసును నిత్య 11.50 సెకన్ల టైమింగ్‌తో పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. ట్రాక్‌పై చిరుతను తలపించిన నిత్య..ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ స్వర్ణం ఖాతాలో వేసుకుంది. ఇటీవల కాలంలో నిలకడగా రాణిస్తూ వస్తున్న ఈ యువ అథ్లెట్ జాతీయ స్థాయిలో పతకాలు కొల్లగొడుతున్నది.

భారత బాక్సర్ల జోరు



అమ్మాన్(జోర్డాన్): ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. పోటీలకు రెండో రోజైన సోమవారం జరిగిన వేర్వేరు బౌట్లలో తికమ్‌సింగ్ (52కి), ఉధమ్‌సింగ్ (54కి), రాహుల్ గరియా (57కి) ముందంజ వేశారు. ఆది నుంచే పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన 52కిలోల విభాగంలో తికమ్‌సింగ్..అలీ అల్మెస్మారీ(యూఈఏ)పై అలవోక విజయం సాధించాడు. మిగతా బౌట్లలో ఉధమ్ సింగ్..మహమ్మద్ పార్సా(ఇరాన్)పై, రాహుల్.. లీషా జున్(చైనీస్ తైపీ)పై విజయాలు సాధించారు.

శాంసన్‌కు గాయం

జైపూర్: ఐపీఎల్‌లో వరుస ఓటములతో సతమతమవుతున్న రాజస్థాన్ రాయల్స్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. రెగ్యులర్ కెప్టెన్ సంజూ శాంసన్ మళ్లీ గాయపడ్డాడు. ఢిల్లీతో మ్యాచ్ సందర్భంగా పక్కటెముకల నొప్పితో ఇబ్బందిపడ్డ శాంసన్ ఇంకా పూర్తిగా కోలుకోలేదు. సొంత ఇలాఖాలో లక్నోతో మ్యాచ్‌కు దూరమైన శాంసన్ గురువారం ఆర్‌సీబీతో మ్యాచ్‌కు కూడా అందుబాటులో ఉండటం లేదు. ఈ విషయాన్ని రాజస్థాన్ ఫ్రాంచైజీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే శాంసన్ కోలుకుని జట్టులోకి తిరిగి ఎప్పుడు వస్తాడన్న దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

జీటీ గెలుపు జోరు

కోల్‌కతాపై ఘన విజయం ● గిల్, సుదర్శన్ విజృంభణ ● గుజరాత్ బౌలర్ల సమిష్టి ప్రదర్శన

గిల్ (90)

కోల్‌కతా: ఐపీఎల్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్రయాణం పడుతూ లేస్తూ సాగుతున్నది. ఒక మ్యాచ్ గెలుస్తూ, మరో మ్యాచ్‌లో ఓడుతున్న కోల్‌కతా మళ్లీ అదే పంథాను అనుసరించింది. సొంత ఇలాఖాలో కోల్‌కతాకు మరోమారు చుక్కెదురైంది. సోమవారం ఈడెన్‌గార్డెన్స్‌లో జరిగిన పోరులో గుజరాత్ టైటాన్స్(జీటీ) 39 పరుగుల తేడాతో కోల్‌కతాపై ఘన విజయం సాధించింది. తొలుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్(55 బంతుల్లో 90, 10ఫోర్లు, 3సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీకి తోడు సాయి సుదర్శన్(36 బంతుల్లో 52, 6ఫోర్లు, సిక్స్) సమయోచిత ఇన్నింగ్స్‌తో గుజరాత్ 20 ఓవర్లలో 198/3 స్కోరు చేసింది. వీరిద్దరు తొలి వికెట్‌కు 114 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అరోరా, రానా, రస్సెల్ ఒక్కో వికెట్ తీశారు. లక్ష్యఛేదనలో కోల్‌కతా 20 ఓవర్లలో 159/8 స్కోరు చేసింది. కెప్టెన్ రహానే(50) అర్ధసెంచరీ మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. ప్రసిద్ధ్ కృష్ణ, రషీద్‌ఖాన్ రెండేసి వికెట్లతో కోల్‌కతా పతనంలో కీలకమయ్యారు. గిల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

సుదర్శన్ (52)

గిల్, సుదర్శన్ ధనాధన్: టాస్ గెలిచిన కోల్‌కతా కెప్టెన్ రహానే బౌలింగ్ ఎంచుకున్నాడు. తాను తీసుకున్న నిర్ణయం తప్పని తెలుసుకోవడానికి రహానేకు పెద్దగా సమయం పట్టలేదు. బ్యాటింగ్‌కు బాగా అనుకూలిస్తున్న పిచ్‌పై గుజరాత్ ఓపెనర్లు గిల్, సుదర్శన్ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. కోల్‌కతా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ఈ ద్వయం బౌండరీలతో విజృంభించారు. ఆరోరా మూడో ఓవర్‌లో సుదర్శన్ రెండు ఫోర్లతో చెలరేగగా, మరో వైపు తానేం తక్కువ కాదన్నట్లు గిల్ కూడా చెలరేగాడు. రానాను లక్ష్యంగా చేసుకుంటూ ఐదో ఓవర్‌లో వరుసగా రెండు ఫోర్లతో ఇన్నింగ్స్‌కు ఊపు తీసుకొచ్చాడు. దీంతో పవర్‌ప్లే ముగిసేసరికి గుజరాత్ వికెట్ కోల్పోకుండా 45 పరుగులు చేసింది. ఎక్కడా జోరు తగ్గించని గిల్..అలీ వేసిన 7వ ఓవర్‌లో వరుసగా 6,4, 4 బాదడంతో 17 పరుగులు వచ్చి చేరాయి. బౌలింగ్ మార్పుగా వచ్చిన మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని గిల్, సుదర్శన్ విడిచిపెట్టలేదు. ఈ క్రమంలో ఇద్దరు పోటాపోటీగా పరుగులు సాధించే ప్రయత్నం చేశారు. బంతి తేడాతో గిల్, సుదర్శన్ అర్ధసెంచరీ మార్క్ అందుకున్నారు. ఇన్నింగ్స్ దూసుకెళుతున్న తరుణంలో సుదర్శన్‌ను రస్సెల్ ఔట్ చేసి కోల్‌కతాకు బ్రేక్ ఇచ్చాడు. దీంతో తొలి వికెట్‌కు 114 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌నకు బ్రేక్ పడింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన బట్లర్(41 నాటౌట్)..గిల్‌కు జతకలిశాడు. బట్లర్‌ను అండగా చేసుకుంటూ గిల్ మరింత చెలరేగాడు. దీంతో గుజరాత్ ఇన్నింగ్స్ ఊపందుకుంది. 18వ ఓవర్‌లో గిల్ ఔట్ కావడం, ఆ వెంటనే రాహుల్ తెవాటియా(0)కూడా పెవిలియన్ చేరారు. ఆఖర్లో బట్లర్, షారుఖ్ ఖాన్(11 నాటౌట్) బ్యాట్లు ఝుళిపించడంలో విఫలం కావడంతో ఆఖరి 5 ఓవర్లలో గుజరాత్ 59 పరుగులకే పరిమితమైంది.

కోల్‌కతా ఢమాల్: నిర్దేశిత లక్ష్యఛేదనలో కోల్‌కతా వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న వికెట్‌కీపర్, బ్యాటర్ గుర్బాజ్(1) ఘోరంగా విఫలం కాగా, నరైన్ (17), వెంకటేశ్ (14), రింకూసింగ్ (17), రస్సెల్ (21), రమణ్‌దీప్‌సింగ్(1), అలీ(0) తీవ్రంగా నిరాశపరిచారు. చెత్త షాట్లకు పోయిన కోల్‌కతా బ్యాటర్లు మూల్యం చెల్లించుకున్నారు. వచ్చిన బ్యాటర్లు వచ్చినట్లు పెవిలియన్‌కు క్యూ కట్టడంతో సాధించాల్సిన రన్‌రేట్ అంతకంతకూ పెరుగుతూ పోయింది. ఇదే అదనుగా గుజరాత్ బౌలర్లు ఒత్తిడి పెంచడంతో కోల్‌కతా బ్యాటర్లు నిలదొక్కుకోలేకపోయారు. ఆఖర్లో రఘువంశీ(27 నాటౌట్) ఒంటరి పోరాటం జట్టును గెలిపించలేకపోయింది.

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 20 ఓవర్లలో 198/3(గిల్ 90, సుదర్శన్ 52, రస్సెల్ 1/13, అరోరా 1/44), కోల్‌కతా: 20 ఓవర్లలో 159/8(రహానే 55, రఘువంశీ 27 నాటౌ, ప్రసిద్ధ్ 2/25, రషీద్ 2/25)

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	పా	ర.రే
గుజరాత్	8	6	2	12	1.10
ఢిల్లీ	7	5	2	10	0.58
బెంగళూరు	8	5	3	10	0.47
పంజాబ్	8	5	3	10	0.17
లక్నో	8	5	3	10	0.08
ముంబై	8	4	4	8	0.48
కోల్‌కతా	8	3	5	6	0.21
రాజస్థాన్	8	2	6	4	-0.63
హైదరాబాద్	7	2	5	4	-1.21
చెన్నై	8	2	6	4	-1.39

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

ఆర్థిక విధాన నిర్ణయాలు వద్దు

జీతాలు, రోజువారీ ఖర్చులకు హైకోర్టు అనుమతి హెచ్‌సీఏకు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, ఏప్రిల్ 21,(నమస్తే తెలంగాణ): నిధుల దుర్వినియోగ అభియోగాల నేపథ్యంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆర్థికపరమైన విధాన నిర్ణయాలు ఏమీ తీసుకోరాదని హైకోర్టు సోమవారం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. సిబ్బంది జీతభత్యాలు, రోజువారీ ఖర్చులకు మాత్రమే చెల్లింపులు చేయాలని, ఇతర ఆర్థిక విధాన నిర్ణయాల జోలికి వెళ్లరాదని చెప్పింది. హెచ్‌సీఏలో నిధుల దుర్వినియోగంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలంటూ ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదంటూ తెలంగాణ క్రికెట్‌అసోసియేషన్(టీసీఏ) దాఖలు చేసిన పిటీషన్‌ను జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. సీనియర్ న్యాయవాది రాజాశ్రీపతిరావు వాదిస్తూ, హెచ్‌సీఏ మేనేజింగ్ కమిటీ నిధుల దుర్వినియోగ చర్యలు తీసుకుందని, ఖాతాలను సక్రమంగా నిర్వహించలేదని చెప్పారు. ప్రస్తుత మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హత లేకపోయినప్పటికీ వాస్తవాలను దాచిపెట్టి పోటీ చేసి గెలిచారన్నారు. ఇప్పటికే గత ఆఫీసు బేరర్లపై కేసు ఉందని, బ్యాట్లు, బంతులు, జిమ్ పరికరాల కోసం అధిక ధరలతో అగ్రిమెంట్లు చేసుకున్నారని చెప్పారు. క్విడ్‌ప్రోకో కింద లబ్ధి పొందిన గత కమిటీ ఉపాధ్యక్షుడు సురేందర్ అగర్వాల్‌కు చెందిన రూ.51.29 లక్షలను ఈడీ జప్తు చేసిందని గుర్తు చేశారు. దీనిపై ఎఫ్ఐఆర్ కూడా ఉందన్నారు. హెచ్‌సీఏ తరఫున సీనియర్ న్యాయవాది జె.రామచంద్రరావు ప్రతివాదన చేస్తూ, ఇటీవలే మేనేజింగ్ కమిటీ ఎన్నికైందని, సుప్రీంకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా విచారణాధికారి నియమితులయ్యారని చెప్పారు. విచారణాధికారి పర్యవేక్షణలోనే ఎన్నికలు జరిగాయన్నారు. ఆరోపణలన్నీ గత పాలకవర్గం పైనే అని చెప్పారు. అసోసియేషన్ నిబంధనల ప్రకారమే నిర్వహణ జరుగుతోందన్నారు. వాదనల తర్వాత హైకోర్టు, మేనేజింగ్ కమిటీపై తీవ్రమైన ఆరోపణలని, ఇవి విచారణలో తేలాల్సి వుందని, ఈ నేపథ్యంలో హెచ్‌సీఏ ఆర్థికపరమైన విధాన నిర్ణయాలు తీసుకోవడం సబబుకాదని స్పష్టం చేసింది. రోజువారీ ఖర్చులు, జీతభత్యాల చెల్లింపులకు మాత్రమే అనుమతిస్తున్నట్లు స్పష్టం చేసింది.

సిమ్రన్‌ప్రీత్‌కు రజతం

ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్

లిమా (పెరూ): ప్రతిష్ఠాత్మక ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత యువ షూటర్ సిమ్రన్‌ప్రీత్ కౌర్ రజత పతకంతో మెరిసింది. సోమవారం జరిగిన మహిళల 25 మీటర్ల పిస్టల్ ఫైనల్లో సిమ్రన్‌ప్రీత్ కౌర్ 33 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. సున్ యుజి (34, చైనా), యావో జియాన్‌జున్ (29, చైనా) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఇదే విభాగంలో పోటీ పడ్డ మను భాకర్ (22), ఇషాసింగ్ (17) వరుసగా నాలుగు, ఆరు స్థానాల్లో నిలిచి నిరాశపరిచారు. మరోవైపు 10మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్‌ఈవెంట్‌లో రుద్రాంక్ష్, ఆర్య జోడీ రజతం ఖాతాలో వేసుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో భారత ద్వయం 11-17తో నార్వే జోడీ చేతిలో ఓటమిపాలైంది.

ఫౌజీ బడ్జెట్ 700కోట్లు?



ప్రభాస్ 'ఫౌజీ' సినిమా బడ్జెట్ అక్షరాలా 700కోట్లట. ఆ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రముఖ బాలీవుడ్ నటుడు మిథున్ చక్రవర్తి ఓ ఛానల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించారు. 'నాకు సంబంధించిన సన్నివేశాల చిత్రీకరణ కోసం ప్రత్యేకంగా నెలరోజుల క్రితం ట్రయల్ షూట్ నిర్వహించారు. అనుకోకుండా ఆ షూట్‌లో నా చేయి ఫ్రాక్చర్ అయ్యింది. దాంతో నెలరోజులు రెస్ట్ తీసుకున్నా. ఈ నెల చివరి నుంచి డేట్స్ ఇచ్చా. నాకోసం ప్రభాస్ తన డేట్స్ మార్చుకుని, ఈ నెల చివరి నుంచి నాతోపాటు ఆయన కూడా షూటింగ్‌లో పాల్గొనబోతున్నారు. అంత పెద్ద స్టార్ అలా చేయడం నాకెందుకో హార్ట్ టచింగ్‌గా అనిపించింది. 'ఫౌజీ' అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న సినిమా. ఈ ప్రాజెక్ట్‌కి దాదాపు రూ.700 కోట్లు ఖర్చు చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు' అని తెలిపారు మిథున్ చక్రవర్తి. ఇదిలావుంటే.. కొన్ని రోజుల క్రితం షూటింగులన్నింటికీ బ్రేక్ ఇచ్చేసి వెకేషన్ అంటూ ఇటలీ వెళ్లారు ప్రభాస్. మూడ్నాలుగు రోజుల్లో మళ్లీ ఆయన తిరిగి ఇండియా చేరుకోనున్నారు. ప్రస్తుతం ప్రభాస్ హీరోగా నటిస్తున్న ది రాజాసాబ్, ఫౌజీ సినిమాలు చిత్రీకరణ దశలో ఉన్నాయి. ప్రభాస్ ఇండియా రాగానే వీటి షూటింగులపై క్లారిటీ రానుంది. మిథున్ మాటలను బట్టి ఆయన ముందు 'ఫౌజీ' సెట్‌లోకి ఎంటరవుతారని అర్థమవుతోంది.

అట్లీ సినిమా కోసం లుక్‌టెస్ట్

చిత్రం

అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కనున్న పాన్ వరల్డ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం ప్రిపరేషన్స్ మొదలయ్యాయి. కొద్దిరోజుల క్రితమే ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడింది. 'పుష్ప' ఫ్రాంచైజీ తర్వాత అల్లు అర్జున్ నటిస్తున్న చిత్రమిదే కావడంతో దేశావ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు ఈ సినిమా కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. దర్శకుడు అట్లీ తనదైన శైలి మాస్, యాక్షన్ అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని తెలిసింది. ఈ సంవత్సరాంతంలో ఈ సినిమా సెట్స్‌మీదకు రానుంది. ఈ సినిమా ప్రిపరేషన్‌లో భాగంగా కొద్దిరోజుల క్రితం హీరో అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ ముంబయి వెళ్లారు. త్వరలో అల్లు అర్జున్ పాత్రకు సంబంధించిన లుక్‌టెస్ట్, కాన్సెప్ట్ షూట్‌ను తీయబోతున్నారని తెలిసింది. అల్లు అర్జున్ లుక్ విషయంలో దర్శకుడు అట్లీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాడని, రెండు మూడు ఆప్షన్స్‌ను పరిశీలిస్తున్నారని సమాచారం. సైన్స్ ఫిక్షన్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని, భారతీయ సినిమాలో ఇప్పటివరకు రాని వినూత్నమైన కాన్సెప్ట్ ఇదని చెబుతున్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ బయోపిక్‌లో..

బాలీవుడ్‌లో ప్రయోగాత్మక, విలక్షణ కథా చిత్రాల్లో నటిస్తూ మంచి గుర్తింపును తెచ్చుకున్నారు రాజ్‌కుమార్ రావు. తాజాగా ఆయన ప్రముఖ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ నిఖమ్ బయోపిక్‌లో నటించబోతున్నారు. తొలుత ఈ బయోపిక్‌లో అమీర్‌ఖాన్ నటించడానికి ఆసక్తిని చూపించారు. ఆయన హీరోగా ఈ ప్రాజెక్ట్ దాదాపు ఖరారయ్యింది. అనివార్య కారణాల వల్ల ఇటీవల అమీర్‌ఖాన్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడంతో రాజ్‌కుమార్ రావును మేకర్స్ సంప్రదించారు. పబ్లిస్ ప్రాసిక్యూటర్‌గా ఉజ్వల్ నిఖమ్ ఎన్నో సంచలనాత్మక కేసులను టేకాఫ్ చేశారు. 1993 ముంబయి పేలుళ్లు, ముంబయిపై జరిగిన దాడి ఘటనలు, గుల్షన్ కుమార్ హత్యకేసుతో పాటు హైప్రొఫైల్ మర్డర్ కేసుల్లో ఆయన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. భారత న్యాయవ్యవస్థకు ఆయన చేసిన సేవలకు గాను 2016లో పద్మపురస్కారం వరించింది. తాజాగా ఆయన బయోపిక్ తెరకెక్కబోతున్నది. ఈ సినిమా కోసం తాను ప్రత్యేకంగా సిద్ధం కాబోతున్నానని, ఉజ్వల్ నిఖమ్ వాదించిన కేసులను కూడా పరిశీలిస్తున్నానని రాజ్‌కుమార్ రావు తెలిపారు.

సారంగపాణి ఆ లోటు తీర్చాడు

'ఫుల్ లెన్త్ కామెడీ జోనర్ మినహా అన్ని తరహా సినిమాలూ నిర్మించా. జంధ్యాల జీవించి ఉన్న రోజుల్లో ఆయన కనిపించినప్పుడల్లా అడిగేవాడ్ని 'ఓ సినిమా చేసి పెట్టండి సార్..' అని. 'చేద్దాంలే ప్రసాద్..' అంటూ ఉండేవారాయన. కానీ ఆ కోరిక తీరకుండానే ఆయన వెళ్లిపోయారు. దాంతో ఆ లోటు అలాగే ఉండిపోయింది. ఇప్పుడు 'సారంగపాణి జాతకం' సినిమాతో ఆ లోటును దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ భర్తీ చేశాడు. రెండున్నర గంటలపాటు హాయిగా నవ్వుకునే కామెడీ థ్రిల్లర్ ఇది. నిర్మాతగా నా కెరీర్‌లో గుర్తుండిపోయే మరో సినిమాగా 'సారంగపాణి జాతకం' నిలుస్తుంది' అని నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ అన్నారు. ప్రియదర్శి, రూపా కొడువయూర్ జంటగా ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో ఆయన నిర్మించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. ఈ నెల 25న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ విలేకరులతో ముచ్చటించారు. 'ఇంద్రగంటి 'జెంటిల్‌మేన్'తో నిర్మాతగా నా సెకండ్ ఇన్నింగ్స్ మొదలైంది. 'సమ్మోహనం'తో మా సంస్థకు ఇంద్రగంటి మరో విజయాన్నిచ్చారు. రేపు రానున్న 'సారంగపాణి జాతకం'తో మా కాంబినేషన్‌లో హ్యాట్రిక్ రాబోతుంది. ఈ సినిమా కథ, కథనం అందర్నీ మెప్పిస్తుంది. సినిమా చాలా బాగా వచ్చింది. సరైన రిలీజ్ కోసమే కాస్తంత టైమ్ తీసుకున్నాం. సమ్మర్ హాలిడేస్ స్టార్ట్ అయ్యాయి. ఇదే మంచి సీజన్ అనుకొని ఏప్రిల్ 25న వస్తున్నాం.' అని తెలిపారు శివలెంక కృష్ణప్రసాద్. ఈ సినిమా చూసిన శ్రేయోభిలాషులంతా బావుందని మెచ్చుకున్నారని, ద్వితీయార్థం నెక్స్ట్ లెవల్లో ఉంటుందని, ఆద్యంతం ఆసక్తికరంగా సినిమా సాగుతుందని, ప్రియదర్శి, నరేశ్, వెన్నెలకిశోర్, అవసరాల శ్రీనివాస్, వైవాహర్షల కామెడీ హైలైట్‌గా నిలుస్తుందని, 'కోర్ట్'లో సీరియస్ మోడ్‌లో కనిపించిన ప్రియదర్శి.. ఈ సినిమాలో పూర్తిభిన్నంగా కనిపించి అందర్నీ నవ్విస్తారని శివలెంక కృష్ణప్రసాద్ చెప్పారు.

'సుమతి శతకం' మొదలైంది

'బిగ్‌బాస్' ఫేమ్ అమర్‌దీప్ చౌదరి, సైలీ చౌదరి జంటగా నటిస్తున్న 'సుమతి శతకం' చిత్రం సోమవారం విజయవాడలో ప్రారంభమైంది. ఎం.ఎం.నాయుడు దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని కొమ్మాలపాటి సాయిసుధాకర్ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి ఏపీ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ క్లాప్‌నివ్వగా, వెన్నా సాంబ శివారెడ్డి కెమెరా స్విచాన్ చేశారు. యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇదని, వినోదానికి పెద్దపీట వేస్తున్నామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: హాల్‌స్వామి ఎస్, సంగీతం: సుభాష్ ఆనంద్, నిర్మాణ సంస్థ: విజన్ మూవీ మేకర్స్, దర్శకత్వం: ఎం.ఎం.నాయుడు.

దేశంలోనే అతిపెద్ద మహిళా కాప్ ఫ్రాంచైజీ

యష్‌రాజ్ ఫిల్మ్స్‌వారి 'మర్దానీ' ఫ్రాంచైజీ ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. ఈ పదేళ్లలో వచ్చిన రెండు సీజన్లూ బ్లాక్‌బస్టర్స్‌గా నిలిచాయి. దేశంలోని అతిపెద్ద మహిళా కాప్ ఫ్రాంచైజీగా 'మర్దానీ' రికార్డులకెక్కింది. ప్రస్తుతం 'మర్దానీ' మూడో సీజన్‌కు సంబంధించిన అప్‌డేట్‌ను మేకర్స్ విడుదల చేశారు. న్యాయంకోసం నిస్వార్థంగా పోరాడే డేర్ డెవిల్ శివానీ శివాజీరాయ్‌గా రాణీముఖర్జీ మళ్లీ ఈ 'మర్దానీ 3'లో కనిపించనున్నారనీ, వచ్చే ఏడాది ఫిబ్రవరి 27న హోలీ పండుగ కానుకగా ఈ సినిమా విడుదల కానున్నదని సోమవారం ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకలా 'మర్దానీ 3' ఉంటుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ మాస్‌ని ఆకట్టుకునేలా ఉంది.



ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'ఎలెవన్'



నవీన్‌చంద్ర ప్రధాన పాత్ర పోషిస్తున్న ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'ఎలెవన్'. లోకేశ్ అజ్ల్స్ దర్శకుడు. రేయా హరి కథానాయికగా నటిస్తూ అజ్మల్‌ఖాన్‌తో కలిసి ఈ సినిమాను నిర్మిస్తోంది. మే 16న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు ప్రమోషన్స్ విషయంలో దూకుడు పెంచారు. ఆద్యంతం ఉత్కంఠను రేకెత్తించే ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ఇదని, సగటు ప్రేక్షకునికి కావాల్సిన అంశాలన్నీ ఈ కథలో ఉంటాయని మేకర్స్ తెలిపారు. రుచిర ఎంటర్టైన్మెంట్స్ ద్వారా ప్రముఖ పంపిణీదారుడు ఎన్.సుధాకర్‌రెడ్డి ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. అభిరామి, రవివర్మ, కిరీటి దామరాజు, ఇందులో కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: కార్తీక్ అశోకన్, సంగీతం: డి.ఇమ్మాన్.

మిస్టరీ కథతో '6 జర్నీ'

రవిప్రకాశ్ రెడ్డి, సమీర్‌దత్త, టేస్టీ తేజ, పల్లవి, రమ్యారెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం '6జర్నీ'. బసీర్ ఆలూరి దర్శకుడు. పాల్యం రవిప్రకాష్ రెడ్డి నిర్మాత. ఈ నెల 25న విడుదలకానుంది. ఈ సందర్భంగా ఇటీవల ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ.. లవ్, యాక్షన్ మిస్టరీ కథాంశమిదని, ఆద్యంతం అనూహ్య మలుపులతో ఉత్కంఠను పంచుతుందని అన్నారు. ట్రైలర్‌కు మంచి స్పందన లభించిందని, యువత మెచ్చే అన్ని అంశాలుంటాయని నిర్మాత రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. ఆరుగురు మిత్రుల ప్రయాణం నేపథ్యంలో నడిచే కథ ఇదని హీరో సమీర్ దత్త పేర్కొన్నారు.

ఆ లైక్ వెనక మర్మమేమిటో..?

అగ్ర కథానాయిక సమంత ఓ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌కు కొట్టిన లైక్ ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. సోషల్‌మీడియాలో చురుగ్గా ఉండే ఈ భామ మహిళాసాధికారతతో పాటు వారిలో స్ఫూర్తినింపే అంశాల పట్ల అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి ఎప్పుడూ ముందుంటుంది. అలాగే మహిళల ఆరోగ్యం, ఫిట్‌నెస్ సంబంధిత అంశాలను కూడా తన పోస్టుల్లో ప్రస్తావిస్తుంటుంది. తాజాగా ఆమె వైవాహిక బంధాలు విఫలం కావడం గురించి 'సక్సెస్‌వెర్స్' అనే ఓ ఇన్‌స్టా ఖాతా షేర్ చేసిన పోస్ట్‌కు లైక్ కొట్టింది. 'జీవిత భాగస్వామి అయిన భార్య అనారోగ్యానికి గురైతే.. పురుషులు ఆమెను వదిలివేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు భిన్నంగా మహిళలు మాత్రం అనారోగ్యానికి గురైన భర్త పక్షాన ఉండాలని కోరుకుంటున్నారు' అంటూ ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ పోస్ట్‌కు సమంత లైక్ కొట్టడం సోషల్‌మీడియాలో చర్చనీయాంశమైంది. అసలు ఆ లైక్ వెనుక కారణాలేమిటో అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. 2021లో నాగచైతన్య-సమంత విడాకులు తీసుకున్నారు. అయితే అందుకు గల కారణాలను వారిద్దరు ఇప్పటివరకూ వెల్లడించలేదు. ఈ నేపథ్యంలో సమంత పోస్ట్‌కు లైక్ కొట్టడం సోషల్‌మీడియాలో చర్చకు దారితీసింది. ప్రస్తుతం సమంత 'రక్త్ బ్రహ్మాండ్' అనే సిరీస్‌లో నటిస్తున్నది. నిర్మాతగా ఆమె తొలిచిత్రం 'శుభం' మే 9న రిలీజ్ కానుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.